క్లుప్తంగా

17న మహాధర్నా



పోతనాపల్లిలో వాల్‌పోస్టర్లను విడుదల చేసిన దళిత ఉద్యమ సభ్యులు

శృంగవరపుకోట: నియోజకవర్గ కేంద్రమైన ఎస్.కోట పట్టణంలో ఈ నెల 17న అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం నేతృత్వంలో నిర్వహించ తల పెట్టిన మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పోతనాల్లిలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత ఉద్యమ నేతలు ఆతవ ఉదయ్‌భాస్కర్, పేదా సూరిదేముడు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేసి, ఎస్సీల రిజర్వేషన్లు 25 శాతం పెంచాలని, అట్రాసిటీ యాక్ట్‌లో సెక్షన్ 41 రద్దు వంటి అంశాలపై నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోనెల ఈశ్వరరావు, ఎద్దు సూర్యారావు, మొయ్యి దేవా, కె.రాంబాబు, ఎం.వి.రమణ, టి.భాగ్యం, గణేష్ పాల్గొన్నారు.

ఎదుగుదల లేని పిల్లల సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్

గజపతినగరం: మానసికంగా ఎదుగుదల లేకపోయినా, గాయాలు తగిలి మతి స్థిమితం కోల్పోయిన వ్యక్తుల సమాచారం ఇవ్వాలని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక సివిల్ కోర్టులో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానసిక స్థితిగతులతో బాధపడుతున్న వారికి మంచి వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత

జామి: గత విద్యా సంవత్సరంలో అలమండ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పద్మావతి ప్రేరణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పాఠశాల పూర్వపు విద్యార్థి సామంతపూడి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో హెచ్‌ఎం రామారావు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన బోని మనోహర్‌కు రూ.25వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గాజుల యశ్వంత్‌కు రూ.15వేలు అందజేశారు. తొమ్మిదో తరగతిలో ప్రతిభ చూపిన వి.ఇషాక్‌కు రూ.20వేలు, బి.రోహిత్‌కు రూ.15వేలు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన



జామిలో నిర్వహించిన ఎలక్ట్రానిక్ వస్తు ప్రదర్శన

జామి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విజయనగరం జిల్లా జీఎస్టీ తూర్పు విభాగం అధికారి రెడ్డి శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ వస్తు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. వాటి ఫలాలు ప్రతి వినియోగదారుడికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్యాక్స్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన విద్యార్థుల అక్షరాకృతి



మెంటల్ హెల్త్ ఆకారంలో కర్లాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మెంటల్ హెల్త్ ఆకారంలో సిద్ధం చేసి అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సకుమల్ల శివాజీ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎదురయ్యే మానసిక సమస్యలను పరిష్కరించుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ ఒత్తిడి సమయంలో సైతం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.నారాయణరావు, పీడీ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని.. సమావేశాలెందుకు!



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ

- తాగునీటి పథకం ప్రాజెక్ట్స్ విభాగం సేవలు శూన్యం
- ప్రతీ సమావేశంలో సభ్యులు చెబుతున్నా ఫలితం లేదు
- జి.ములగాంలో టీడీపీ కార్యకర్త ఇంటిలో రేషన్ డిపో
- టీడీపీ కార్యకర్తలకు తొత్తులుగా అధికారులు వ్యవహరిస్తున్నారు
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

చీపురుపల్లి: మండల సర్వసభ్య సమావేశంలో చర్చించే ప్రతీ విషయానికి విలువ ఉండాలి. ఆ సమస్యను మినిట్స్‌లో నమోదు చేసి పరిష్కారం దిశగా చర్యలు జరగాలి. కానీ సుదీర్ఘ కాలంగా ప్రతీ మండల సర్వసభ్య సమావేశంలోనూ చర్చించుకునే అంశాలే మళ్లీ మళ్లీ చర్చించుకుంటూ ఉంటే ఇక ఆ సర్వసభ్య సమావేశానికి విలువఎక్కడ ఉంటుంది, సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు ఎందుకు పెట్టుకోవాలి అంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షిత మంచినీటి విభాగం(ప్రాజెక్ట్స్), వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖలపై సభ్యులు మండిపడ్డారు. ఈ సందర్భంగా గొల్లలములగాం సర్పంచ్ కరిమజ్జి శ్రీనివాసరావు, ఇటకర్లపల్లి సర్పంచ్ మీసాల రమణ, మెట్టపల్లి ఎంపీటీసీ ముల్ల ఈశ్వరరావు మాట్లాడుతూ ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకం(ప్రాజెక్ట్స్) విభాగం సేవలు శూన్యంగా ఉన్నాయన్నారు. ఇదే విషయాన్ని ఎన్నో సమావేశాల్లో చెబుతున్నా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా, నిర్వహణ విషయంలో ఆ శాఖ పూర్తిగా విఫలమయ్యిందన్నారు. వారికి ఇచ్చే జీతాలు కూడా దండగ అంటూ ఆవేదన చెందారు. ప్రాజెక్ట్స్ అంటూ చెప్పుకోవడానికి తప్ప వారు చేసేదేమీ లేదని స్పష్టం చేశారు. ఇటకర్లపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ లీకవుతుండడంతో తాగునీరు వృథాగా పోతోందని ఇదే విషయాన్ని సంబంధిత శాఖాధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు.

టీడీపీ కార్యకర్త ఇంటి వద్ద రేషన్ డిపో

గొల్లలములగాం గ్రామంలో డీలర్ వద్ద ఉండాల్సిన రేషన్ డిపో టీడీపీ కార్యకర్త ఇంటి వద్ద నిర్వహిస్తున్నారని దీంతో చాలా మంది లబ్ధిదారులు సరుకులు తీసుకునేందుకు వెళ్లడం లేదన్నారు. టీడీపీ కార్యకర్త ఇంటి వద్ద రేషన్ డిపో ఉండడం నిబంధనలకు విరుద్ధమా.. కాదా.. అని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని రెవెన్యూ అధికారులను అడుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆ గ్రామ సర్పంచ్ కరిమజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు.

ఎరువులు లేక రైతుల అవస్థలు

వ్యవసాయ శాఖ నివేదిక సమర్పిస్తున్న సమయంలో సభ్యులు మండిపడ్డారు. ఎరువులు లేక రైతులు అల్లాడిపోయారని, ఎరువులు పంపిణీలో రాజకీయం చోటు చేసుకుందని, ఎరువులు లేక రైతులు మొక్కజొన్న పంట నష్టపోవాల్సి వచ్చిందని నిలదీశారు. రూ.250కు కొనుగోలు చేసుకోవాల్సిన యూరియా లభించక, రూ.2 వేలు వెచ్చించి డీఏపీ కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడిందన్నారు. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమయ్యిందని ధ్వజమెత్తారు. సమావేశంలో జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైస్ ఎంపీపీ కరిమజ్జి వెంకటరమణమ్మ, ఎంపీడీవో ఐ.సురేష్, తహసీల్దార్ డి.ధర్మరాజు, ఏఎంసీ చైర్మన్ రేగాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించి విజయం సాధించాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు

చీపురుపల్లి: విద్యార్థులతో పాటు యువత ఒత్తిడిని జయించినప్పుడే విజయం సాధించగలరని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, సైకాలజిస్టు మిరియాల కృష్ణారావు చెప్పారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఒత్తిడి అధికంగా ఉండడం ద్వారా మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. విద్యార్థులు మానసిక ప్రశాంతంత కలిగినప్పుడే లక్ష్యాలు సాధించగలరని అన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రశాంత జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. మనిషి జీవితంలో ఒత్తిడి, భయం, ఆత్మన్యూనతాభావం వ్యక్తిత్వ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని చెప్పారు. మానసిక ప్రశాంతతకు పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవాలన్నారు. మానసిక రుగ్మతలు వస్తే ఎలాంటి సందేహం లేకుండా మానసిక వైద్యులకు చూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ కుమార్, కామర్స్ అధ్యాపకులు పి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర



ఎస్.కోట: సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కనకలక్ష్మి

కొత్తవలస: మానసిక దివ్యాంగులకు ప్రతీ ఒక్కరు అండగా వుంటూ వారికి చేసే సేవను దైవ సేవగా భావించాలని కొత్తవలస కోర్టు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.విజయచంద్ర అన్నారు. ప్రపంచ మానసిక దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కోటపాడు రోడ్డులో గల చైతన్య బధిరల ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానసిక ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులను అగౌరవంగా, చులకనగా చూడరాదన్నారు. అలాంటి వారిని అక్కున చేర్చుకొని తీర్చిదిద్దాలన్నారు. కొత్తవలస కోర్టు బార్ అధ్యక్షురాలు డివిఎల్.దేవి, సీనియర్ న్యాయవాదులు సిహెచ్‌ఆర్.ప్రసాద్, డి.శ్రీనివాస్, డి.శివప్రసాద్, కె.అచ్చిబాబు, జి.వి.రమణ, ఎస్.శ్రీరామ్మూర్తి, గవర కృష్ణ, బధిరల పాఠశాల నిర్వాహకులు ప్రముఖ న్యాయవాది భోజింకి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సదస్సులో జడ్జి కనకలక్ష్మి మాట్లాడుతూ నేడు అనేక మంది మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని, వయస్సుతో సంబంధం లేకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోర్టుకు హాజరయ్యే కక్షిదారులు కూడా ఆందోళనలకు గురవటం చూస్తున్నామన్నారు. బార్ అసోషియేషన్ కార్యదర్శి బి.వి.రామారావుతో పాటూ పలువురు న్యాయవాదులు హాజరయ్యారు.

నాటి సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలి



బొడ్డవరలో రిలే నిరాహార దీక్షల్లో జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: ఒకనాటి గ్రామసభల్లో తీర్మానాలు పెట్టి పేదల భూములను జిందాల్ కంపెనీకి ఇచ్చేందుకు చొరవ చూపిన సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని జిందాల్ నిర్వాసితులు కొత్త పల్లవి అందుకున్నారు. శుక్రవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగించిన నిర్వాసితులు మాట్లాడుతూ నాడు భూములు ఇప్పించి, నేడు తాము ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా తిరుగుతున్న బొడ్డవర, కిల్లంపాలెం, ముషిడిపల్లి మాజీ సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాటి గ్రామసభల్లో తీర్మానించిన తొమ్మిది అంశాల్లో ఏ ఒక్కటి కూడా జిందాల్ యాజమాన్యం నెరవేర్చ లేదన్నారు. పంచాయతీల హక్కులను కాలరాస్తూ.. ప్రజాస్వామ్య వ్యవస్థల్ని ప్రశ్నించేలా వ్యవహరిస్తున్న జిందాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలు చేస్తున్న వారితో పాటు నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏలను నియమించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు

చీపురుపల్లి: నియోజవకర్గంలోని అన్ని మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ ఏజెంట్స్(బీఎల్‌ఏ)ను అన్ని రాజకీయ పార్టీలు నియమించుకోవాలని సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ డి.ధర్మరాజు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవకర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లోని 257 పోలింగ్ కేంద్రాల్లో ప్రతీ రాజకీయ పార్టీ నుంచి బూత్ లెవెల్ ఏజెంట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే కొత్త ఓటర్లు చేర్పులు, సవరణలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. సమర్థవంతమైన ఓటర్ల జాబితా తయారీ కోసం ఈ సమావేశాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు ఐ.నీలకంఠం, పి.మురళి, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన తప్పనిసరి

- ఏఎస్ఓ యు.సంతోష్‌కుమార్



మెరకముడిదాం వ్యవసాయశాఖ కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్న ఏఎస్ఓ సంతోష్‌కుమార్

మెరకముడిదాం: పంటకోత ప్రయోగాలపై అవగాహన తప్పనిసరి అని ఏఎస్ఓ యు.సంతోష్‌కుమార్ అన్నారు. మెరకముడిదాం వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలానికి చెందిన విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలు, ఏఈఓలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంట కోతప్రయోగాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. 2025–26 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు మండలంలోని 18 రైతుసేవా కేంద్రాల పరిధిలో 58 చోట్ల వరి పంటకోత ప్రయోగాలు నిర్వహించాల్సి ఉందని, నిబంధనల ప్రకారం దిగుబడి లెక్కించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జి.శ్రావణితేజ, ఎస్.గోపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అనర్థదాయకం

- వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు



బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు

మెరకముడిదాం: బాల్యవివాహాల వల్ల చాలా అనర్థాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు అన్నారు. ఉత్తరావల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆడ పిల్లలకు 18, మగవారికి 21 సంవత్సరాలు నిండాకే వివాహం చేసుకోవాలన్నారు. చిన్నవయసులో వివాహాలు చేసుకోవడం వల్ల పిల్లల్లో శారీరక ఎదుగుదల ఉండదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, సచివాలయ మహిళా కానిస్టేబుల్ పి.శివదుర్గ, ఏఎన్‌ఎం జి.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి



శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: పక్కా ప్రణాళికలను తయారు చేయడం ద్వారానే గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఎంపీపీ చల్లా చలంనాయుడు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండవ రోజు పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఆర్థిక వనరులను గుర్తించి పంచాయతీల ఆదాయాలను పెంచుకోనే విధంగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిరిబాల, ఈవోపీఆర్‌డీ ఎ.రఘుపతిరావు, సీనియర్ సహాయకులు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వైద్య సేవలు

- ఎస్.కె.ఎం.ఎల్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం..



ఎస్.కె.ఎం.ఎల్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: పట్టణంలో ఎస్.కె.ఎం.ఎల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం డాక్టర్ బి.డి.కె.సోమశేఖర్ నేతృత్వంలో ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీచైర్మన్ శోభా స్వాతిరాణి సహా పలువురు నాయకులు హాజరై ఆస్పత్రితో పాటు వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యజమాని బి.డి.కె.సోమశేఖర్ మాట్లాడుతూ తండ్రి డాక్టర్ ధర్మలింగాచారి ఆశీస్సులతో గ్రామీణప్రాంతంలో మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ఆస్పత్రిని నిర్మించినట్టు తెలిపారు. చిన్నపిల్లలకు ఎన్‌ఐసీయూ, 24 గంటల పారామెడికల్ స్టాఫ్, పీడియాట్రిక్స్ ఓ.పి, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, పెయిన్ సర్వీసెస్, ల్యాబ్, ఎక్స్‌రే, ఈసీజీ, జనరల్ మెడిసన్, న్యూరాలజీ, రేడియాలజీ, ఆంకాలజీ, ఎండోక్రానాలజీ వంటి విభాగాల్లో సేవలు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు.

సీజేఐపై దాడి అమానుషం



లక్కవరపుకోట: గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

గజపతినగరం: సుప్రీం కోర్టు సాక్షిగా సీజేఐ గవాయ్‌పై బూటుతో దాడి చేయడం అమానుషమని, ఇది దేశ చరిత్రలో మాయని మచ్చ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.లక్ష్మి మండిపడ్డారు. మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ దాడికి పాల్పడిన న్యాయవాది కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలంతా గవాయ్‌పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా చూడాలన్నారు. ప్రజలంతా తీవ్రంగా ఖండించాలన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇటువంటి దాడులు పెచ్చుమీరుతున్నాయని అన్నారు. దేశంలో న్యాయమూర్తులకే రక్షణ ఇవ్వలేని ప్రభుత్వాలు సాధారణ ప్రజలకు ఏమి రక్షణ కల్పిస్తాయని ప్రశ్నించారు.

న్యాయమూర్తిపై దాడి అమానుషం

లక్కవరపుకోట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై కొద్ది రోజుల క్రితం న్యాయవాది దాడికి యత్నంచడం అమానుషమని సీపీఎం నాయుకులు అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సీపీఎం నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. నిందితుడుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యంపై దాడులు పేట్రేగుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హైస్కూల్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెతో గర్భిణులకు అవస్థలు



బొద్దాం పీహెచ్‌సీలో తనిఖీల కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు

వేపాడ: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల సమ్మె చేయడంతో తనిఖీలకు వచ్చిన గర్భిణులు అవస్థలు పడ్డారు. మండలంలోని బొద్దాం పీహెచ్‌సీకి శుక్రవారం తనిఖీలకుకు వచ్చిన గర్భిణులు ఇబ్బందులు పడ్డారు. వైద్యులు తనిఖీలు నిర్వహించకపోవడంతో ఎంఎల్‌హెచ్‌పీలు తనిఖీలు చేసి మందులు అందజేశారు.

ప్రజా వైద్యం.. ప్రజల హక్కు


- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ
- జగన్ నిర్వహించిన నర్సీపట్నం నిరసన ర్యాలీ సక్సెస్
- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కోటి సంతకాల సేకరణ కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ప్రజా వైద్యం,.. ప్రజల హక్కు కాగా ప్రజారోగ్య రంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి సంబంధించిన కరపత్రాలను మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలో గల మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి ప్రభుత్వ వైద్య రంగాన్ని సువర్ణ అధ్యాయంగా మార్చారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం ఆ కార్యక్రమాలను నీరుగారుస్తూ ప్రజలకు ఆరోగ్య భద్రత లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీనికి నిరసనగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో చేపట్టిన నిరసన ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేశారన్నారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన వైద్య కళాశాలలను డబ్బులకు అమ్ముడు పోయి ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దారుణమన్నారు. దీని వలన వైద్య విద్య, వైద్యం పేద ప్రజలకు దూరమవుతుందన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో . కోటి సంతకాల సేకరణ ఈ నెల 13 నుంచి ప్రతీ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సంతకాల సేకరణ చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొరపల్లి జయప్రకాష్‌శివ, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, పల్లా భీష్మ, కొట్యాడ శ్రీనివాసరావు, పవన్‌కుమార్, చందులూరు ఎంపీటీసీ యద్ల కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సత్కారం



అన్నపూర్ణదేవిని దుశ్శాలువ కప్పి సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గుర్ల: మండలంలోని ఈవోపీఆర్‌డీగా పని చేసి ఎంపీడీవోగా ఉద్యోగన్నతి పొందిన అన్నపూర్ణదేవిని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని అకాక్షించారు. ఎంపీడీవో రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గజపతినగరం: ప్రపంచంతో పోటీ పడదాం అనే కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులకు క్విజ్ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్టు మర్రివలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.చంద్రరావు తెలిపారు. శుక్రవారం గజపతినగరం మండలం మర్రివలస ప్రాథమిక పాఠశాలలో గణితం, ఇంగ్లిష్, సైన్స్ మొదలగు అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు.